క్లుప్తంగా

పడమర ఖండ్రిక పీఏసీఎస్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

కపిలేశ్వరపురం: పడమర ఖండ్రిక వ్యవసాయ సహకార సంఘం త్రిమెన్ కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా సంఘం సీఈఓ మెండు శ్రీనివాస్ సభ్యులతో ప్రమాణ చేయించారు. చైర్మన్‌గా అంగరకు చెందిన పుత్సల శ్రీనివాస్, సభ్యులుగా కర్రి పార్వతి, మాతా వెంకటరమణ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గుడాల జయబాబు, అల్లూరి రామకృష్ణ చౌదరి, ముత్యాల వెంకటరావు, పువ్వుల చిట్టిబాబు, వల్లూరి వీరబాబు, కొండేటి నాగేశ్వరరావు, అంగర, పడమర ఖండ్రిగ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో మత ప్రచారం ఆరోపణపై విచారణ

కపిలేశ్వరపురం: కోరుమిల్లిలోని ప్రైవేట్ పాఠశాలలో మత ప్రచారం చేస్తున్నారంటూ అందిన ఫిర్యాదుపై సోమవారం విద్యాశాఖాధికారులు విచారణ చేపట్టారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మత ప్రచారం చేస్తున్నారని అందిన ఫిర్యాదులోని అంశాలపై రామచంద్రపురం డీవైఈఓ రామలక్ష్మణరావు సమాచారాన్ని సేకరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఫిర్యాదుదారులతో మాట్లాడారు. విచారణాంశాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని డీవైఈఓ తెలిపారు. ఆయన వెంట ఎంఈఓ కె.తాతారావు, ఎంఐఎస్ టి సురేష్, సీఆర్‌పీ సిబ్బంది ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం (ఫైల్)

రాయవరం: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్లు రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 70 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి పసలపూడి చైతన్య రైసుమిల్లు సమీపంలో రహదారి పక్కన అపస్మారక స్థితిలో పడిపోవడంతో ఇది చూసిన చుట్టుపక్కల వారు 108కు ఫోన్ చేయడంతో సిబ్బంది వచ్చి వృద్ధుడిని రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. వృద్ధుడి వివరాలు తెలియరాలేదని, ఆయన ఆచూకీ తెలిసిన వ్యక్తులు 9440904843 నంబరుకు ఫోన్ చేసి, సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

మోతాదుకు మించి ఎరువులు వాడవద్దు

కాజులూరు: రైతులు వరి సాగులో అవసరమైన మోతాదుకు మించి ఎరువులను వినియోగించవద్దని మండల వ్యవసాయాధికారి అశోక్ అన్నారు. మండలంలోని చేదువాడ, తిప్పిరాజుపాలెం, అయితపూడి, అంద్రంగి తదితర గ్రామాల్లో సోమవారం ఏవో అశోక్ తదితర అధికారులు పర్యటించి క్షేత్రస్థాయిలో రైతులకు పలు సూచన చేశారు. ఆయన మాట్లాడుతూ నానో టెక్నాలజీ ద్వారా మార్కెట్లో లభ్యమవుతున్న నానో యూరియా, డీఏపీలను వాడటం ద్వారా సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. ఎరువులకు ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి

రాయవరం: ప్రతి గ్రామంలో రైతులు పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ సూచించారు. రాయవరం రైతు సేవా కేంద్రంలో సోమవారం వ్యవసాయ, ఉద్యాన సహాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏవో రమేష్‌కుమార్ మాట్లాడుతూ బీమా కోసం రైతు వాటా చెల్లించేందుకు ఈనెల 15వ తేదీ వరకూ గడువు ఉందని ఆయన పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు, రైతు సేవా కేంద్రంలో నమోదు చేసేందుకు ప్రభుత్వం మరో అవకాశం ఇస్తుందని ఆయన తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.25 వేల విరాళం


దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలుచేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు అదే గ్రామానికి చెందిన తటవర్తి లక్ష్మీనారాయణ వారి కుటుంబ సభ్యులు సోమవారం రూ.25 వేలు విరాళంగా అందించారు. విరాళం అందించిన దాత కుటుంబ సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ పర్యవేక్షకులు సత్యమూర్తి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈఓ వి.సత్యనారాయణ దాత కుటుంబ సభ్యులను అభినందించారు.

శిథిలావస్థలో బోడిపాలెం వంతెన

- తుప్పుపట్టి బలహీనపడిన ఇనుప గడ్డర్లు
- పర్యాటకుల రాకపోకలకు ఇదే ఆధారం
- వ్యవసాయ ఉత్పత్తుల తరలింపునకు ఉపయోగం
- ప్రస్తుత అవసరాలకు సరిపోని నిర్మాణం
- నూతన వంతెన నిర్మించాలంటున్న పర్యాటకులు, భక్తులు


శిథిలస్థితిలో ఉన్న బోడిపాలెం వంతెన

కపిలేశ్వరపురం: జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందిన కపిలేశ్వరపురం మండలంలోని కేదారిలంకలో ధనమ్మ తల్లి ఆలయానికి వెళ్లే మార్గంలో బోడిపాలెం వద్ద నిర్మించిన బెయిలీ వంతెన ప్రస్తుతం శిథిలస్థితికి చేరుకుంది. సుమారు ఎనిమిది దశాబ్దాల క్రితం నిర్మితమైన ఆ వంతెన ఎప్పుడు కూలిపోతుందోనన్న భయాందోళనలో లంక గ్రామాల ప్రజలున్నారు. లంక గ్రామాల రైతులు వ్యవసాయ ఉత్పత్తులను ఈ వంతెన మీదుగానే తరలిస్తుంటారు. జిల్లా పర్యాటక కేంద్రంగా ఉన్న ధనమ్మ మర్రికి ఈ వంతెన మీదుగానే పర్యాటకులు రాకపోకలు సాగిస్తుంటారు.

వంతెన పరిస్థితి ఇలా,..

కొత్తపేట ఆర్‌అండ్‌బీ రహదారిని ఆనుకుని ఉన్న ఈ బెయిలీ వంతెనను బ్రిటిష్ హయాంలో నిర్మించారు. కపిలేశ్వరపురం మండలంలోని కేదారిలంక, వీధివారిలంక, నారాయణలంక గ్రామాలను సమీప కొత్తపేట మండలంలోని కొత్తపేట వాడపాలెం వెళ్లేందుకు ఈ వంతెన అనుసంధానంగా ఉపయోగపడుతోంది. దీనికి తోడు ప్రస్తుత అవసరాలకు ఈ వంతెన అనువుగా లేదు. వంతెన నిర్మాణానికి వినియోగించిన ఇనుప గడ్డర్లు తుప్పుపట్టి బలహీనపడ్డాయి. ఇనుప రేకులు పూడిపోయి ప్రమాదాలకు సంకేతాలుగా మారాయి. లంక గ్రామాల్లోని వ్యవసాయ ఉత్పత్తులను, ఇసుక, మట్టి, ఇటుకలను ఇతర ప్రాంతాలకు ఈ వంతెన మీదుగానే తరలిస్తుంటారు. కేదారిలంక, నారాయణలంకల్లోని ఇసుక ర్యాంపుల నుంచి వాహనాలు ఈ వంతెన మీదుగా వెళ్తున్నాయి. వంతెన రక్షణ గోడలు తరచూ ఊడిపడినప్పుడల్లా తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. కార్తీక మాసంలో వందలాది మంది వాహనాల్లో ఈ వంతెన మీదుగా ధనమ్మ మర్రికి చేరుకుంటాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న నేపథ్యంలో కొత్త వంతెనను నిర్మించాలని లంక గ్రామల ప్రజలు, భక్తులు, పర్యాటకులు కోరుతున్నారు.


శిథిలమైన వంతెన ఫ్లోరింగ్

వంతెన ప్రాధాన్యాన్ని గుర్తించాలి



పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా ధనమ్మ మర్రి విరాజిల్లుతోంది. ఈ క్షేత్రానికి చేరుకునేందుకు భక్తులు బోడిపాలెం వంతెన మీదుగానే రావాల్సి వస్తుంది. ప్రస్తుత అవసరాలకు ఈ ఇరుకు వంతెన సరిపోవడం లేదు. వంతెన ప్రాధాన్యాన్ని గుర్తించి అధికారులు నూతన వంతెన ప్రక్రియను ప్రారంభించాలి.

– పోలిశెట్టి గణేష్, గ్రామస్తులు, కేదారిలంక

పీజీఆర్ఎస్‌కు 6 అర్జీలు


ఆర్డీఓ అఖిలకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

రామచంద్రపురం: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్(పీజీఆర్ఎస్)కు 6 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ దేవరకొండ అఖిల విలేకరులకు తెలిపారు. ఇంటి స్థలం ఇప్పించాలని ఒకటి, పాస్ పుస్తకం ఇప్పించాల్సిందిగా ఒకటి, వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ చేయించాల్సిందిగా, తల్లికి వందనం సొమ్ము వచ్చేలా చూడాలని, ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదులు అందాయి. దీనితో పాటు గుబ్బల వెంకటరమణ, శీలం సత్యనారాయణ అనువార్లు తమ స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేస్తామని మోసం చేశారని న్యాయం చేయాలని కోరుతూ ధర్మ శ్రీను అనే వ్యక్తి ఆర్డీఓకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

జగనన్న పాలనలోనే ప్రభుత్వ పాఠశాలల పురోగతి


సన్నపు కుమారస్వామి

కాజులూరు: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పురోగతి చెందాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి సన్నపు కుమారస్వామి అన్నారు. మండలంలోని తనుమళ్లలో సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2019కి ముందు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఉండేవి కావన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టడంతో పాటు నాడు–నేడు ద్వారా అన్ని వసతులు ఏర్పరచారన్నారు. దీంతో విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలను వదిలి ప్రభుత్వ పాఠశాలల బాట పట్టారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం పాఠశాలలను పూర్తిగా విస్మరించడంతో విద్యార్థులు పాఠశాలలకు దూరమవుతున్నారన్నారు. జగనన్న పాలనలో ఏటా అమ్మఒడి ద్వారా రూ.13 వేలు చొప్పున క్రమం తప్పకుండా సొమ్ములు విడుదల చేసేవారన్నారు. అయితే కూటమి నాయకులు అమ్మఒడి పథకానికి పేరు మార్చి తల్లికి వందనం ద్వారా ఎంత మంది పిల్లలుంటే అంతమందికి రూ.15 వేలు ఇస్తామని తొలి ఏడాది ఎగ్గొట్టారన్నారు. రెండో ఏడాది పథకం అమలు చేస్తున్నా కొంత మందికి మాత్రమే సొమ్ములు జమచేస్తూ ‘మమ’ అనిపిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరంలో ఏమీ చేయకపోయినా, సుపరిపాలనకు తొలి అడుగు పేరుతో ఊరూరా తిరుగుతూ సొంత డబ్బా కొట్టుకుంటున్నారని విమర్శించారు.

ఇంటర్ విద్యార్థినులకు యూనిఫాం అందజేత


దాతల సమక్షంలో యూనిఫాం అందుకున్న విద్యార్థినులు

కపిలేశ్వరపురం: మాచర ప్లస్ టూ ఉన్నత పాఠశాలలోని ఇంటర్మీడియట్ విద్యార్థినులకు దాతలు యూనిఫాంను సమకూర్చారు. హెచ్ఎం కె.విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాతల సమక్షంలో విద్యార్థినులకు యూనిఫాం అందజేశారు. మాచర అలూమిని సభ్యులు మట్టపర్తి సత్యనారాయణ, గొడవర్తి భగవన్నారాయణ, వీధి కామరాజు, దిగుబడి శ్రీరాములు ఆర్థిక సౌజన్యంతో 22 మంది ఇంటర్ విద్యార్థినులకు రెండేసి జతలు చొప్పున రూ.16వేలు విలువైన యూనిఫాంను సమకూర్చడాన్ని పలువురు అభినందించారు. కార్యక్రమంలో అలూమినీ సభ్యుడు గుడాల వెంకటరమణ, ఉపాధ్యాయులు నూకపెయ్యి వెంకట్రావు, షిరిడి సాయి, రాయుడు ఉదయ్ కృష్ణ, జీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగించాలి


ఎంపీడీవో కీర్తిస్పందనకు ఫ్లెక్సీలు తొలగించాలని వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రాయవరం: మండలంలోని పలు గ్రామాల్లో వివిధ రాజకీయ పక్షాలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ నాయకులు ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు శాఖ దుర్గాశ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకిరాంబాబు, కొత్తపల్లి శ్రీదేవి, బీజేపీ నాయకులు సరాల రాంబాబు, చిరట్ల సుబ్బారావు తదితరులు మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో వివిధ రాజకీయ పక్షాలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నాయన్నారు. పాత ఫ్లెక్సీలు కనబడకుండా కొత్త ఫ్లెక్సీలు ఉంచడం వలన వ్యక్తులు, రాజకీయ పార్టీల మధ్య, వివిధ వర్గాల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుగానే తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో ఎస్.కీర్తిస్పందనకు మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చింతా తమ్మిరెడ్డి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఈరెల్ల కృష్ణమూర్తి, అంగర జనార్ధన స్వామి, శాకా సత్యదేవి పాల్గొన్నారు.

బలవంతపు మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిద్దాం

మలికిపురం: బలవంతంగా విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించవద్దని అలా చేస్తే వ్యతిరేకిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మలికిపురంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆగస్టు 5న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ధర్నాలను జయప్రదం చేయాలన్నారు. విద్యుత్ భారాలను ప్రజలపై మోపొద్దని, ట్రూ అప్ చార్జీలను రద్దుచేయాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించవద్దని, వినియోగదారులు కూడా మీటర్ల బిగింపును అడ్డుకోవాలని అన్నారు. స్మార్ట్ మీటర్ల వలన మరింత విద్యుత్ భారం మోయాలని, ముందుగానే విద్యుత్ బిల్లులు రీచార్జ్ చేసుకోవాలని, రాత్రి పూట వినియోగించే చార్జీలు మరింత ప్రీమియంగా ఉంటాయని అన్నారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు బిగించకుండా పగులగొట్టాలని పిలుపునిచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తగదన్నారు. రేపు సబ్‌స్టేషన్ల వద్ద జరిగే ధర్నాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని నిరసన తెలియచేయాలని రాజేంద్రప్రసాద్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు గెద్దం, ప్రభాకరరావు, చెల్లుబోయిన తాతారావు, దేవ సురేషబాబు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనే ధ్యేయంగా పని చేయాలి


చొప్పెల్లలో ఇటుక బట్టీ కార్మికుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటున్న అధికారులు

ఆలమూరు: జిల్లా వ్యాప్తంగా మలేరియా నిర్మూలనే ధ్యేయంగా పనిచేయాలని జిల్లా మలేరియా ప్రత్యేక అధికారి ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలోని ఇటుక బట్టీలను సోమవారం వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహలత, డి.సాయికిషోర్‌తో కలసి సందర్శించారు. కార్మికుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే సత్వరమే సమీప ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్సను అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కొత్తపేట డివిజన్ మలేరియా యూనిట్ అధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు, సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈఓలు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, ఆర్.బాలామణి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం


వడ్లమూరులో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు


మండపేటలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శ్రీదేవి

కపిలేశ్వరపురం: తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరమని ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్ పరిధిలోని సూపర్‌వైజర్ మాణిక్యం అన్నారు. కపిలేశ్వరపురం మండలంలోని వడ్లమూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లులకు వైద్య ఆరోగ్య కార్యకర్తలు పౌష్టికాహారం ప్రాధాన్యాన్ని వివరించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, అచ్యుతాపురం ఎంఎల్‌హెచ్‌పీ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహనతో వ్యవహరించాలి

కపిలేశ్వరపురం (మండపేట): తల్లీబిడ్డల సంరక్షణ విషయంలో శాస్త్రీయ పద్ధతిలో అవగాహనతో వ్యవహరించాలని ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, సుజాత అన్నారు. మండపేట్టంలోని బాపూజీ స్కూల్ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలోనూ, మెర్నిపాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలను నిర్వహించారు. సూపర్‌వైజర్లు మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ వరకూ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఉషారాణి, ఎంఎస్‌కే లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త మేరీ, వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయవరంలో..

రాయవరం: అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ బి.ఈశ్వరి ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. రాయవరంలో బాలింత తల్లులు, గర్భిణులకు, వారి కుటుంబ సభ్యులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నేడు రచ్చబండ

అంబాజీపేట: బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీలో భాగంగా రచ్చబండ కార్యక్రమాన్ని గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రు, చిరతపూడి, ఇసుకపూడి గ్రామాల్లో మంగళవారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొనున్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మహిళలకు స్వయం ఉపాధిపై శిక్షణ

పి.గన్నవరం: ఊడిమూడి శివారు ఆదిమూలంవారిపాలెంలో మహిళలకు స్వయం ఉపాధిపై శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. అగరవత్తులు, ఇతర పూజా సామగ్రి తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్టు ఎస్ఎస్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీలు సంధ్య, మోహనకృష్ణ తెలిపారు. శిక్షణ అనంతరం మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు వేతనం ఇవ్వనున్నట్టు వారు వివరించారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు ఆదిమూలం వెంకన్నబాబు నివాసం వద్ద ఏర్పాటు చేసిన ఈకార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ యాళ్ల విజయదుర్గ, గ్రామానికి చెందిన మహిళలు పాల్గొన్నారు.

ఆబోతుకు అంత్యక్రియలు

కొత్తపేట: రోడ్డుపై కారు ఢీకొని మృతి చెందిన ఆబోతుకు గ్రామస్తులు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కొత్తపేట మండలం మోడేకుర్రు పరిధిలో తిరిగే ఆబోతును గొలకోటివారిపాలెం వద్ద సోమవారం తెల్లవారుజామున ఒక కారు ఢీకొట్టింది. ఆబోతు అక్కడికక్కడే మరణించింది. ఆబోతు మరణించిన విషయం తెలిసిన సర్పంచ్ కె.రామలక్ష్మి దంపతులు వెళ్లి, పండితుల సూచనల మేరకు ఆబోతు మృతదేహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఖననం చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు తప్పిన పెను ప్రమాదం

ఆలమూరు: జొన్నాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపేట ఎంపీడీఓ నరేష్‌కుమార్‌కు పెను ప్రమాదం తప్పింది. ఎంపీడీఓ ఉద్యోగ బాధ్యతల నిమిత్తం రాజమహేంద్రవరం నుంచి కొత్తపేటకు కారులో బయలుదేరారు. స్థానిక జొన్నాడ సెంటర్‌కు వచ్చేసరికి కారు అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు పాక్షిక గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఆలమూరు ఎంపీడీఓ ఎ.రాజు, ఎస్సై జి.నరేష్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎంపీడీఓ నరేష్‌కుమార్‌ను రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

పుష్కరాల పనులకు అంచనాలు రూపొందించాలి


పుష్కరాల నిమిత్తం చేపట్టాల్సిన పనులపై అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ అఖిల

రామచంద్రపురం: గోదావరికి పుష్కరాలు 2027 జూలై నెలలో ప్రారంభం కానున్న సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపట్టవలసిన అభివృద్ధి పనులకు గాను ఆయా శాఖల అధికారులు అంచనాలు రూపొందించాలని రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల ఆదేశించారు. డివిజన్ పరిధిలోని ఇంజినీరింగ్ అధికారులతో ఆమె సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని గోదావరి నది వెంబడి ఉన్న స్నాన ఘట్టాల అభివృద్ధి, స్నాన ఘట్టాలకు వెళ్లే అప్రోచ్ రోడ్ల అభివృద్ధికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్దేశిత సమయంలో అంచనాలు రూపొందించి బడ్జెట్ మంజూరు కోసం సమర్పించాలని సూచించారు. దీంతో పాటు వివిధ శాఖల వారీగా చేపట్టాల్సిన పనులపై ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం అంచనాలకు రూపకల్పన చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఫైర్, ఫిషరీష్, ఏపీఈపీడీసీఎల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అవసరం


ఇసుకపూడిలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

అంబాజీపేట: పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని హెచ్ఎం ఎ.లక్ష్మీ వరప్రసాద్ అన్నారు. ఇసుకపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత కొన్నేళ్లుగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్ ఆకెళ్ల మంగళగిరి శాస్త్రి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సుబ్బారావు, ఆయన కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో రూ.50 వేలు విలువైన మినీ ఆర్వో ప్లాంటును పాఠశాలకు సోమవారం వితరణ చేశారు. హెచ్ఎం వరప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తాగేందుకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో లేకపోవడంతో ఆర్వో ప్లాంట్ల నుంచి టిన్నుల ద్వారా తాగునీరు రప్పించుకుంటున్నారన్నారు. విద్యార్థులు బాటిల్స్‌తో ఇంటి నుంచి వాటర్ తెచ్చుకున్నా సరిపోకపోవడంతో బయట నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నామని తెలిపారు. పాఠశాలలో ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను గుర్తించిన గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునుకుట్ల నాగేశ్వరమౌళి పాఠశాలలో తాగునీటి సమస్యను దాతల దృష్టికి తీసుకువెళ్లడంతో సమస్య పరిష్కారమై ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ పళ్ల స్వామి నాయుడు దాతల సమక్షంలో ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. పాఠశాలకు మినీ ఆర్వో ప్లాంట్‌ను బహూకరించిన దాతలకు పాఠశాల సిబ్బంది, యాజమాన్యం కమిటీ అభినందనలు తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడులు


ఎల్.గన్నవరంలో ఆయిల్‌పామ్ రైతుకు సత్కారం

పి.గన్నవరం: ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాఖ అధికారి శైలజ అన్నారు. మండలంలోని ఎల్.గన్నవరంలో సోమవారం ఉద్యాన శాఖ, సర్వేసాయి ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేటు లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కంపెనీ జనరల్ మేనేజర్ కేజే ప్రభాకర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శైలజ మాట్లాడుతూ ఈపంట సాగుపై రైతులకు లభించే రాయితీలను వివరించారు. ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుతో ఎకరానికి ఏడాదికి ఖర్చులు పోను రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకూ ఆదాయం పొందవచ్చని వివరించారు. ఓసారి మొక్కలు వేస్తే 35 ఏళ్లపాటు దిగుబడి వస్తుందన్నారు. ఎక్కువ లాభాలు పొందిన రైతు మట్టా వెంకటరావును సత్కరించారు. గ్రామంలో చిట్టాల జోగేశ్వరరావు ప్రాంగణం వద్ద ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఇన్‌చార్జి సర్పంచ్ గనిశెట్టి గంగాభవాని, ఏజీఎం పి.వీరభద్రం, మేనేజర్ బి.వెంకట కృష్ణంరాజు, సెంటర్ ఇన్‌చార్జిలు హరికృష్ణ, రాజు, వెంకటేశ్వరరావు, రైతు నాయకులు ఆరుమిల్లి సత్య సాయిబాబు, సుబ్బారావు, మాజీ సర్పంచ్ యన్నాబత్తుల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ అవనిగడ్డ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలకు ఆహ్వానం

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలోని అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ అనుబంధ సంస్థ అయిన బాల మందిరం ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకులు అంగర గోపాలకృష్ణాచార్యులు (కృష్ణశ్రీ) తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 11న స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నామన్నారు. హైస్కూల్ స్థాయిలోని 6,7,8,9 తరగతుల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆగస్టు 15న జరిగే జాతీయ పతాకావిష్కరణ సభలో గ్రామ పెద్దలు, మండల విద్యాశాఖ అధికారులతో బహుమతులు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల ఏడో తేదీలోగా స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.